andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
శనివారం ఉష్ణోగ్రత గరిష్టం 34.5 : కనిష్టం 27.7
నిర్మల్ జిల్లా వార్తలు
8
ఆదివారం 16 జూన్ 2024





- బదిలీల కదలికతో జిల్లా యంత్రాంగంలో మార్పులు
- జిల్లా కలెక్టర్ బదిలీతో శ్రీకారం
- కొద్ది రోజుల్లోనే మిగతా అన్ని శాఖల అధికారులు బదిలీకి రంగం సిద్ధం
- ఆ తరువాత తహసీల్దార్‌ల వంతు
- పరిపాలనలో సమూల మార్పులు ప్రారంభం

ఇక ప్రక్షాళన



రాష్ట్రంలో అ ధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇక పరిపాలనంతా ప్రక్షాళన చేసేందుకు సిద్ధమైంది. ఇందులో భాగంగానే లోక్‌సభ ఎన్నికల కోడ్ ముగిసిన కొద్ది రోజుల్లోనే బదిలీలకు కార్యాచరణ చేపట్టింది. శనివారం జిల్లా కలెక్టర్‌ను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా ప్రస్తుత కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌ను కామారెడ్డికి బదిలీ చేయగా.. నిర్మల్ జిల్లాకు జీహెచ్‌యంసీ జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్ నియమితులయ్యారు. ఇక కలెక్టర్ నుంచి ప్రారంభమైన బదిలీల ప్రక్రియ అన్నిశాఖల్లోనూ మొదలుకానుందని అంటున్నారు. జిల్లాలో కొన్నిశాఖలకు చాలా ఏళ్ల నుంచి ఇన్‌చార్జీ అధికారులే బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. అలాగే మరికొన్ని శాఖల్లో ఏళ్ల నుంచి అధికారులు ఒకే చోట కొనసాగుతున్నారు. దీని కారణంగా పరిపాలనలో పలు ఆటంకాలు ఏర్పడడం అలాగే ప్రజలు, తమ సమస్యల పరిష్కారంలో ఇబ్బందులకు గురి అవుతుండడం జరిగింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో అడుగడుగునా రాజకీయ జోక్యంతో పాటు అప్పటి ప్రజా ప్రతినిధులు, నేతల అండతో కొన్ని కీలకశాఖలకు అధికారాలున్న వారం దీర్ఘకాలం పాటు కొనసాగారన్న ఆరోపణలున్నాయి. అప్ప టి బీఆర్ఎస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నేతలు చెప్పిందే వేదంగా ఈ అధికారులు బాధ్యతలు నిర్వర్తించారన్న విమర్శలున్నాయి. అప్పటి నేతల కనుసైగల మేరకే కొంతమంది అధికారులు బాధ్యతలు కొనసాగించారన్న వాదనలున్నాయి. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇక పరిపాలనను ప్రక్షాళన చేపట్టేందుకు సిద్ధమైంది. ఇందు లో భాగంగానే మొదట పలు జిల్లాల కలెక్టర్‌లను బదిలీ చేసింది. జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ బదిలీ కావడంతో ఇక ప్రధానమైన శాఖల ఉన్నతాధికారులకు కూడా స్థానచలనం కలగనుందని అంటున్నారు. పరిపాలన రంగంలో కీలకంగా వ్యవహరించే ముఖ్య అధికారులను వారం పదిరోజుల్లో బదిలీ చేసే దిశగా కార్యాచరణ జరుగుతోందని అంటున్నారు. జిల్లా స్థాయి అధికారులందరినీ రాష్ట్రస్థాయిలో అలాగే జిల్లా పరిధిలోని అధికారులను కలెక్టర్ స్థాయిలో బదిలీ చేసే అవకాశాలున్నాయని పేర్కొంటున్నారు. కాగా అన్ని శాఖల అధికారులతో పాటు పరిపాలనలో కీలక మైన తహసీల్దార్‌ల బదిలీలు కూడా మొదలుకాబోతున్నాయని అంటున్నారు. ఎన్నికల సమయంలో జిల్లాలో పని చేసే తహసీల్దార్లందరినీ పొరుగు జిల్లాలకు బదిలీ చేసిన సంగతి తెలిసిందే. ముఖ్యంగా జిల్లాకు చెందిన తహసీల్దార్‌లను ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్ జిల్లాలకు బదిలీ చేశారు. అయితే ఎన్నికలు, కోడ్ ముగియడంతో పొరుగు జిల్లాలకు బదిలీ అయిన తహసీల్దార్లందరినీ వారి సొంత జిల్లాలకు బదిలీ చేయాల్సి ఉంది. జిల్లాకు బదిలీ అయిన తహసీల్దార్‌లంతా ఆ తరువాత ఆయా మండలాలకు బదిలీ కానున్నారు. అయితే ఇప్పటి నుంచే కొన్ని మండలాలకు పైరవీలు మొదలయ్యాయని అంటున్నారు. ఆర్థికంగా వనరులను సమకూర్చేస్థాయిలో గల మండలాలపైనే కొంతమంది రాజకీయంగా పలుకుబడి, పరపతి ఉన్న తహసీల్దార్‌లు బదిలీ వేయించుకునేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారని ప్రచారం జరుగుతోంది. జిల్లాకేంద్రంతో పాటు నియోజకవర్గ కేంద్రంలోని మండలాలకు కొంతమంది తహసీల్దార్‌లు ఇప్పటినుంచే పోటీ పడుతున్నారని చెబుతున్నారు. మొత్తానికి పరిపాలన ప్రక్షాళనలో భాగంగా అన్ని శాఖల అధికారులు బదిలీ కాబోతున్నారంటున్నారు. అయితే తామంతా కొద్దిరోజుల్లోనే బదిలీ కాబోతున్న నేపథ్యంలో కొద్ది రోజుల నుంచి అన్ని శాఖల్లో పాత పెండింగ్ ఫైల్‌లను దులుపుతున్నారంటున్నారు. ఫైల్స్‌ను క్లియరెన్స్ చేసే పనిలో అధికారులతో పాటు సిబ్బంది కూడా ఉన్నట్లు పేర్కొంటున్నారు.

శాఖల వారీగా అధికారుల బదిలీలు

కాగా.. అన్నిశాఖల వారిగా సంబంధిత ఉన్నతాధికారుల బదిలీలు జరగబోతున్నాయంటున్నారు. మొదట జిల్లా కలెక్టర్ బదిలీ కావడంతో ఇక అన్ని శాఖల అధికారులకు స్థానచలనం జరగడం ఖాయమంటున్నారు. కొన్ని శాఖల్లో ఏళ్ల నుంచి తిష్ట వేసుకొని కొనసాగుతున్న అధికారులకు ఈ సారి బదిలీగండం తప్పదని చెబుతున్నారు. తమకున్న రాజకీయ పలుకుబడి, పరపతితో కొంతమంది అధికారులు ఒకే శాఖలో ఏళ్ల నుంచి కొనసాగుతూ ఆ శాఖ కార్యకలాపాలను శాసించే స్థాయికి ఎదిగారన్న వాదనలున్నాయి. అలాగే తమ మాట వినని కిందిస్థాయి సిబ్బందిపై కూడా ఈ అధికారులు వేధింపులకు పాల్పడుతున్నారని చెబుతున్నారు. ఈ దశలో వరుసగా శాఖల వారిగా బదిలీల ప్రక్రియ మొదలుకాబోతోందన్న వాదనలున్నాయి. అయితే గత ట్రాక్ రికార్డ్, పరిపాలన సామర్థ్యం, అనుభవం లాంటి అంశాలకు ప్రాధాన్యత నివ్వాల్సి ఉండగా.. రాజకీయ సిఫారసులకే మొదటి ప్రాముఖ్యత లభించే అవకాశాలు ఉండడంతో కొంతమంది మంచి పోస్టింగులు కోరుకునే అధికారులు అధికార పార్టీ నేతల చుట్టూ చక్కర్లు కొడుతున్నారంటున్నారు.

పాత ఫైళ్లకు మోక్షం

అధికారుల బదిలీల ప్రక్రియ మొదలుకావడంతో కొన్ని శాఖల్లోని ఉన్నతాధికారులు ఇదే అదనుగా ఏళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న ఫైల్స్‌కు మోక్షం కల్పిస్తున్నారంటున్నారు. సాంకేతిక లోపాలు, నిబంధనలకు విరుద్ధమైన అంశాలు అలాగే ఫిర్యాదులు, విమర్శలున్న ఫైళ్లను చాలా కాలం నుంచి ఆయా శాఖల అధికారులు పెండింగ్‌లో పెట్టారు. గత కలెక్టర్‌లు ముషారఫ్ ఆలీ ఫారూఖీ, ఆశిష్ సంగ్వాన్‌లు ఫిర్యాదులు, ఆరోపణలపై సీరియస్‌గా వ్యవహరించడం, ఫైళ్లను క్షుణ్ణంగా తనిఖీ చేయడంతో ఈ అధికారులు వాటిని అప్పటి వరకు పక్కన పెడుతూ వచ్చారు. ఇక కలెక్టర్ బదిలీ కావడం, తాము కూడా బదిలీ అయ్యే అవకాశాలున్న కారణంగా వీరంతా హుటాహుటిన పెండింగ్ ఫైళ్ల దుమ్ము దులిపి వాటికి మోక్షం కల్పించే ప్రయత్నాలు మొదలు పెడుతున్నారంటున్నారు. ఈ వ్యవహారంలో పెద్ద ఎత్తున చేతులు మారే అవకాశాలున్నాయన్న విమర్శలు కూడా మొదలయ్యాయి. కొంతమంది పైరవీకారులు సీరియస్‌గా రంగంలోకి దిగి ఈ ఫైల్‌లకు కదలిక తెప్పిస్తున్నట్లు పేర్కొంటున్నారు. కిందిస్థాయి సిబ్బంది ద్వారా ఉన్నతాధికారులతో ఫైల్‌లను క్లియరెన్స్ చేసుకునే ప్రక్రియ ఇప్పటికే అన్నిశాఖల్లో గుట్టు చప్పుడు కాకుండా మొదలైందంటున్నారు.

(ఆంధ్రజ్యోతి, నిర్మల్)

జిల్లా కలెక్టర్‌గా అభిలాష అభినవ్



నిర్మల్ కల్చరల్, జూన్ 15 : జిల్లా కలెక్టర్‌గా అభిలాష అభినవ్ బదిలీపై రానున్నారు. ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా శనివారం పలు జిల్లాల కలెక్టర్లను బదిలీ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి 20 మందిని బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్‌గా వ్యవహరించిన అభిలాష అభినవ్ నూతన కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. ఇప్పటి వరకు ఇక్కడ పని చేసిన ఆశిష్ సంగ్వాన్ కామారెడ్డి జిల్లా కలెక్టర్‌గా బదిలీ అయ్యారు.

వర్షాల కోసం గోదావరి జలాలతో ఆలయాల అభిషేకం



గంగాజలాలతో శోభయాత్రగా వస్తున్న సుంక్లి గ్రామస్థులు

భైంసా, జూన్ 15 : మండలంలోని సుంక్లి గ్రామస్తులు సమృద్ధిగా వర్షాలు కురియాలని శనివారం గ్రామంలోని ఆలయాలకు గోదావరి జలాలతో అభిషేకం నిర్వహించారు. ఉదయం బాసర నుంచి తీసుకవచ్చిన గోదావరి జలాలకు గ్రామ పొలిమేర నుంచి బాజ భజంత్రీల మధ్య స్వాగతం పలికారు. అనంతరం అక్కడి నుంచి శోభాయాత్రగా తరలించుకవచ్చి గ్రామంలోని ఆలయాలన్నింటిలో గోదావరి జలాలతో అభిషేకం చేపట్టారు. గ్రామస్థులందరూ భజనలు చేస్తూ వరుణ దేవున్ని పూజిస్తూ జలాభిషేక పూజల్లో పాల్గొన్నారు.

'బాబును చూసి నేర్చుకోవలసిన అవసరం సీఎం రేవంత్‌రెడ్డికి లేదు'

నిర్మల్ కల్చరల్, జూన్ 15 : తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి చంద్రబాబును చూసి నేర్చుకోవాలని ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి అనడం సరికాదని.. ఆ అవసరం లేదని కాంగ్రెస్ పార్టీ నాయకుడు మల్లారెడ్డి అన్నారు. శనివారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో మోదీ ఇచ్చిన హామీలు, కాంగ్రెస్ అమలు చేస్తున్న హామీలపై బహిరంగ చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. బీజేపీ నేతలకు కాంగ్రెస్ పార్టీని విమర్శించే నైతిక హక్కు లేదన్నారు.

తనిఖీలు ముమ్మరం చేయాలి : సీఐ

కుభీర్, జూన్ 15 : మండలంలోని చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు ముమ్మరం చేయాలని భైంసా రూరల్ సీఐ నైలు అన్నారు. శనివారం మండల కేంద్రం కుభీర్‌లోని పోలీస్టేషన్‌లో సిర్పెల్లి చెక్‌పోస్టు సిబ్బందితో సమావేశం నిర్వహించారు. బక్రీద్ పండుగ నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. తనిఖీల్లో భాగంగా చెక్‌పోస్టు వద్ద నిర్వహించే విధులను వివరించారు. ఈయన వెంట ఎస్సై రవీందర్, పోలీసు సిబ్బంది ఉన్నారు.



పట్టణంలో నీటి ఎద్దడి తీర్చేందుకు
మరో రెండు వాటర్ ట్యాంకుల నిర్మాణం


- ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్ సత్యం



నూతన వాటర్‌ట్యాంకు నిర్మాణం కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్

ఖానాపూర్, జూన్ 15 : పట్టణంలో నీటి ఎద్దడి తీర్చేందుకు మరో రెండు నూతన వాటర్‌ట్యాంకులను నిర్మించినట్లు మున్సిపల్ చైర్మన్ సత్యం తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో అమృత్ టు పథకం ద్వారా మంజూరైన రెండువాటర్ ట్యాంకుల నిర్మాణానికి శనివారం అధికారులతో కలిసి మున్సిపల్ చైర్మన్ స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ... నూతన వాటర్ ట్యాంకుల నిర్మాణంతో పట్టణంలో త్రాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. రెండు ట్యాంకుల నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించామని త్వరలోనే వాటర్ ట్యాంకుల నిర్మాణం పూర్తి చేసి వార్డుల వారీగా తాగునీటి సరఫరా కోసం పైప్‌లైన్లను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మనోహర్, కౌన్సిలర్ అబ్దుల్ ఖలీల్, కాంగ్రెస్ పార్టీ నాయకులు షబ్బీర్ పాషా, పరిమి సురేష్, సలీంఖాన్, మున్సిపల్ డీఈ సంతోష్ జాదవ్, ఏఈ తిరుపతి, తదితరులున్నారు.

ఘనంగా ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పుట్టిన రోజు వేడుకలు



ఖానాపూర్‌లో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

ఖానాపూర్, జూన్ 15 : తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పుట్టిన రోజు వేడుకలను కాంగ్రెస్ పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కేక్ కట్ చేసి కార్యకర్తలకు మిఠాయిలు పంచారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సత్యం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దయానంద్, పట్టణ అధ్యక్షులు నిమ్మల రమేష్, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజేందర్, ఏడవ వార్డు కౌన్సిలర్ గుగ్లావత్ కిషోర్ నాయక్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు లక్ష్మీపతి గౌడ్, జన్నారపు శంకర్, గొర్రె గంగాధర్, జహీర్, తదితరులున్నారు.

కోతకు వచ్చిన ఆయిల్ పామ్ పంట పరిశీలన



ఆయిల్ పామ్ పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

దిలావర్‌పూర్, జూన్ 15 : మండలంలో కోతకు వచ్చి ఆయిల్ పామ్‌పంటను శనివారం మండల వ్యవసాయాధికారి స్రవంతి సిబ్బందితో కలిసి పరిశీలించారు. దిలావర్‌పూర్ - గుండంపల్లి గ్రామాల మధ్య వెంకట్ రాంరెడ్డి అనే రైతు 2021లో తన వ్యవసాయ క్షేత్రంలో ఆయిల్ ఫామ్ మొక్కలు నాటి సాగుచేస్తున్నాడు. మూడు సంవత్సరాల తర్వాత పంట తొలిసారి కోతకు వచ్చింది. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి ఆయిల్ ఫామ్ పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఆయిల్ ఫామ్ పంట దిగుబడిపై ఎలాంటి అనుమానాలు అవసరం లేదని, పంట దిగుబడి తప్పకుండా వస్తుందన్నారు. ఏఈవోలు శ్రీదేవి, లక్ష్మీ ఉన్నారు.

కొనసాగుతున్న డబుల్ బెడ్‌రూమ్ లబ్ధిదారుల ఆందోళన

- అక్రమించుకున్న ఇళ్లను ఖాళీ చేయాలన్న అధికారులు
- ససేమిరా అంటూ వాగ్వాదానికి దిగిన లబ్ధిదారులు

భైంసా, జూన్ 15 : రెవెన్యూ డివిజన్ కేంద్రమైన భైంసాలో ఇళ్లను కేటాయించాలని డబుల్ బెడ్ రూమ్ లబ్ధిదారులు వారం రోజులుగా చేపడుతున్న ఆందోళనలు కొనసాగుతూనే ఉన్నాయి. ఏడాది కాలం క్రితం లక్కీ డ్రాలో ఎంపికైన తమకు ఇళ్లను కేటాయించకుండా అధికార యంత్రాంగం తాత్సారం చేస్తోందంటూ ఆరోపిస్తూ లబ్ధిదారులు ఆందోళన బాటపట్టారు. ఇళ్లకేటాయింపులో కాలయాపన విధానాలను వ్యతిరేకిస్తూ కొంత మంది లబ్ధిదారులు మూడు రోజుల క్రితం డబుల్ బెడ్ రూమ్ గృహ సముదాయంలోని ఇళ్లను ఆక్రమించుకొని వాటిల్లోనే నివాసముంటున్నారు. శనివారం ఆర్అండ్‌బీ ఈఈ అశోక్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ అశోక్, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్లు కృష్ణ గౌడ్, జయరావ్ నేతృత్వంలోని ఆర్అండ్‌బీ, రెవెన్యూ అధికారుల బృందం ఇళ్లను ఆక్రమించుకొని నివాసముంటున్న లబ్ధిదారులను ఖాళీ చేయించేందుకు చర్యలు చేపట్టారు. అన్ని వసతులు, సౌకర్యాలు కల్పించిన అనంతరం అధికారికంగా ఇళ్లను అప్పగిస్తామని, అప్పటి వరకు ఎవరు కూడా ఇళ్లలో ఉండరాదని, ఆక్రమించుకున్న వారు వెంటనే ఖాళీ చేయాలని అధికారులు వెల్లడించారు. దీంతో ఆక్రమణలో ఉన్న లబ్ధిదారులు అధికారుల చర్యలను నిరసిస్తూ ఆందోళనలు చేపట్టారు. ముకుమ్మడిగా అధికారులను ముట్టడించి నిలదీసారు. ఇళ్లను ఎందుకు ఖాళీ చేయిస్తారంటూ వాగ్వాదానికి దిగారు. తాము ఎలాంటి పరిస్థితుల్లోనూ ఆక్రమించుకున్న ఇళ్లను ఖాళీ చేయమని లబ్ధిదారులు అధికారులకు తెలియచెప్పారు. అంతేకాకుండా డబుల్ బెడ్ రూమ్ గృహ సముదాయాలకు సత్వరమే అన్ని విద్యుత్ వసతి, నీటి సదుపాయం, సానిటేషన్ వ్యవస్థ కల్పనను చేపట్టాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని వెల్లడించారు. లబ్ధిదారులు ఎంత మాత్రం తగ్గకుండా ఆందోళనలను కొనసాగించడంతో చేసేదేమి లేక అధికారులు వెనుతిరిగిపోయారు.



అధికారులతో వాగ్వాదానికి దిగిన లబ్ధిదారులు

- **ప్రజా ప్రతినిధులపై లబ్ధిదారుల ఆగ్రహం**

వారం రోజులుగా ఇళ్ల కేటాయింపు విషయంలో ఆందోళనలు చేపడుతున్న ప్రజా ప్రతినిధులు, రాజకీయ నాయకులు స్పందించక పోవడం పట్ల డబుల్ బెడ్ రూమ్ లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆందోళన స్థలి వద్ద పలువురు లబ్ధిదారులు మాట్లాడుతూ.. ఎన్నికలు అయిపోయాయని తమను ఎవరు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. లక్కీ డ్రాలో లబ్ధిదారులుగా ఎంపికైన తమకు ఇళ్ల కేటాయింపు జరిగేలా చర్యలు చేపట్టకపోవడం విచారకరమన్నారు. ప్రజా ప్రతినిధులు, రాజకీయ నాయకులు తమవైపు కన్నెత్తి కూడా చూడడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ఏజెంట్ మోసానికి వీధిన పడ్డ మరో నిరుపేద కుటుంబం

- బతుకుదెరువుకు దుబాయ్ వెళ్లి.. తనువు చాలించిన కుంచెపు గంగారాం
- మృతదేహాన్ని త్వరగా రప్పించాలని వేడుకోలు



పాత ఎల్లాపూర్‌లోని తన ఇంటి వద్ద రోదిస్తున్న గంగారాం భార్యా పిల్లలను ఓదారుస్తున్న గ్రామస్థులు.. ఇన్‌సెట్‌లో కుంచెపు గంగారాం (ఫైల్)

ఖానాపూర్, జూన్ 15 : బతుకుతెరువు కోసం ఉన్న ఊరిని కన్న వారిని విడిచి దేశం గాని దేశం వలస వెళ్లి అక్కడ ఊహించని మోసాన్ని ఎదుర్కొని ఇటు ఇంటికి రాలేక... అటు అక్కడ చేసేందుకు పనిలేక... ఖానాపూర్ మండలంలోని పాత ఎల్లాపూర్ గ్రామానికి చెందిన కుంచెపు గంగారాం దుబాయ్ దేశంలో అర్థాంతరంగా తన తనువును చాలించిన హృదయ విదారకమైన ఘటన ఈ నెల 10వ తేదీన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే గ్రామస్థులు, కుటుంబ సభ్యులు తెలిపిన కథనం ప్రకారం... ఖానాపూర్ మండలంలోని పాత ఎల్లాపూర్ గ్రామానికి చెందిన కుంచెపు గంగారాం నాలుగేళ్ల క్రితం దుబాయ్ దేశానికి వలస వెళ్లాడు. అక్కడ చేసేందుకు పని లేక తిరిగి స్వగ్రామానికి వచ్చేశాడు. వచ్చిన తర్వాత దుబాయ్ వెళ్లేందుకు చేసిన అప్పులను తీర్చేందుకు ఉన్న ఒక్క ప్లాట్‌ను అమ్ముకున్నాడు. మళ్లీ తిరిగి ఏడు నెలల క్రితం నిజామాబాద్‌కు చెందిన ఓ ఏజెంట్ గంగారాంను దుబాయ్ పంపించాడు. క్లీనింగ్ సెక్షన్‌లో పని చేసేందుకని ఒప్పందం కుదుర్చుకొని వెళ్లిన గంగారాం అక్కడికి వెళ్లిన తర్వాత స్పష్టమైన పని లేక ముప్పతిప్పలు పడ్డాడు. ఓవైపు ఒక్కరోజు పని చేస్తే మరో రోజు రూమ్‌లోనే ఉండిపోవడం చేసిన పనికి సరైన వేతనం ఇవ్వకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతూ ఏడు నెలల కాలాన్ని వెల్లదీశాడు. గత 15 రోజుల క్రితం అనారోగ్యం బారిన పడిన గంగారాంకు కనీసం ఆసుపత్రిలో చూపించుకునేందుకు కూడా డబ్బులు లేకపోవడంతో సూపర్‌వైజర్‌ను సంప్రదించాడు. అతను డబ్బులు ఇవ్వకపోగా ఇబ్బందులకు గురిచేసినట్లు కుటుంబ సభ్యులకు చెబుతూ బాధపడినట్లు ఆయన భార్య గంగామణి, కుటుంబీకులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ కుటుంబానికి రెండుసార్లు దుబాయ్ వెళ్లేందుకు చేసిన అప్పులతో పాటు ఇంటి వద్ద కుటుంబ పోషణ కోసం చేసిన అప్పులు రూ. 5 లక్షల వరకు ఉన్నట్లు గంగామణి తెలిపారు. ఇటు ఇంటికి వెళ్లి అప్పులు తీర్చలేక అక్కడే ఉండి అవస్థలు పడలేక మనోవేదనకు గురైన తన భర్త గంగారాం ఈ నెల 10వ తేదీన దుబాయ్‌లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని గంగామణి బోరున విలపించారు. తనకు మూర్ఛ వ్యాధి ఉందని తనకు ఇద్దరు పిల్లలు ఉన్నారని వారికి ఉండేందుకు కనీసం ఇళ్లు లేని దీనస్థితిలో తమ కుటుంబం ఉందని కన్నీటి పర్యంతమయ్యారు. పెద్ద కుమారుడు చందు గత ఏడాది పదో తరగతి పూర్తికాగానే కుటుంబ పరిస్థితులు బాగా లేకపోవడంతో తనతో పాటు కూలీ పనికి తీసుకెళ్తున్నట్లు గంగామణి తెలిపారు. చిన్న కుమారుడు గంగాధర్ ఎనిమిదో తరగతి చదువుతున్నాడని పేర్కొన్నారు. మృతదేహాన్ని స్వగ్రామానికి త్వరగా తెప్పించి తనకు తన పిల్లలకు చివరి చూపు మిగల్చాలని కోరుతున్నారు.

రైతాంగ సమస్యలు పరిష్కరించాలి : ఏఐపీకేఎస్

నిర్మల్ కల్చరల్, జూన్ 15 : రైతాంగ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ఏఐపీకేఎస్ ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు నంది రామయ్య మాట్లాడుతూ... ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా రైతులకు పురుగుల మందులు, ఎరువులు, విత్తనాలు 50 శాతం సబ్సిడీపై అందజేయాలని డిమాండ్ చేశారు. రెండు లక్షల రుణమాఫీ కాంగ్రెస్ పార్టీ హామీ నెరవేర్చాలన్నారు. ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలోని రైతులు వరి, పసుపు, మొక్కజొన్న, పత్తి, సోయా పంటలు సాగు చేస్తున్నందున సౌకర్యాలు కల్పించాలన్నారు. పంటల బీమా, ఫసల్ బీమా తదితర పథకాలు అమలు చేయాలని కోరారు. కౌలు రైతులకు పథకాలు అమలు చేయాలన్నారు. నాయకులు జక్కుల రాజన్న, శంకర్, కే. రాజన్న, శ్రీనివాస్, లచ్చన్న, సంతోష్, భీంరావు, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ముథోల్ లైన్‌మెన్ సస్పెన్షన్

ముథోల్, జూన్ 15 : మండల కేంద్రమైన ముథోల్ లైన్‌మెన్ హల్దార్‌ను సస్పెండ్ చేసినట్లు భైంసా డివిజన్ ట్రాన్స్‌కో డీఈఈ శ్రీనివాస్‌రెడ్డి శనివారం తెలిపారు. డీఈఈ కథనం ప్రకారం... సంబంధిత లైన్‌మెన్ ముథోల్‌లోని ఓ రైతుకు మూడు బోర్లు ఉన్నప్పటికీ 12 బోర్లు ఉన్నాయని సృష్టించి సంబంధిత అధికారులను తప్పుడు సర్వేచేసి పంపారు. దీంతో మూడు ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరయ్యాయి. అయితే అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించగా సంబంధిత లైన్‌మెన్ సర్వే తప్పు చేసి, డిపార్ట్‌మెంట్‌కు సుమారు రూ. 6 లక్షల 30 వేల నష్టంకు కారకుడు కావడంతో పాటు సంబంధిత అధికారులను తప్పుదోవ పట్టించాడని పేర్కొన్నారు. ఈ విషయంలో ఏడీఈ లక్ష్మణ్ ఇటీవలే విచారణ జరిపారు. దీంతో లైన్‌మెన్ తప్పిదాలు బయటపడడంతో లైన్‌మెన్‌ను సస్పెండ్ చేసినట్లు డీఈఈ పేర్కొన్నారు.

10 జీపీఏ సాధించిన విద్యార్థులకు నగదు బహుమతి : జడ్పీటీసీ

లక్ష్మణచాంద, జూన్ 15 : పదో తరగతిలో 10 జీపీఏ సాధించిన విద్యార్థులందరికీ ఒక్కొక్కరికి రూ. 2,500ల నగదు బహుమతిని అందజేస్తానని జడ్పీటీసీ ఓస రాజేశ్వర్ శనివారం హామీ ఇచ్చారు. మండలంలోని బాబాపూర్‌లో గల జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో జరిగిన ప్రభుత్వ ఉచిత పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫామ్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ విద్యాసంవత్సరం పదో తరగతి పరీక్షలలో 10/10 గ్రేడ్ సాధించిన విద్యార్థిని విద్యార్థులకు తన సొంత ప్రోత్సాహ నగదు బహుమతిగా రూ. 2,500 ఇస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు నగేష్, గ్రామ పంచాయతీ సెక్రటరీ, అంగన్‌వాడీ టీచర్, గ్రామ సమాఖ్య అధ్యక్షులు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అడెల్లి గ్రామాభివృద్ధి కమిటీ ఏర్పాటు

సారంగాపూర్, జూన్ 15 : మండలంలో గల అడెల్లి గ్రామాభివృద్ధి కమిటీని శనివారం ఏర్పాటు చేశారు. ఈ గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులుగా గొడిసెల రాజశేఖర్ గౌడ్, ఉపాధ్యక్షులు రాకేష్ రావు, కోశాధికారి దండు సాయన్న, కార్యవర్గ సభ్యులుగా సురేష్, శంకర్, రాము, చరణ్, భీమేష్, లక్ష్మణ్, గంగన్నలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



కుంటాల, జూన్, 15: మండలంలోని ఓలా గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన నాలం భోజవ్వ కుటుంబ సభ్యులను శనివారం జనగామ మాజీ కలెక్టర్ సిహెచ్. శివలింగయ్య పరామర్శించారు. ఆమె కుమారులు శ్రీనివాస్, మదన్ మోహన్‌ను మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఈయన వెంట స్థానిక నాయకులు హైమద్ పాషాతో పాటు గ్రామస్థులు ఉన్నారు.

పోడు రైతులతో కలెక్టర్‌ను కలిసిన బోథ్ ఎమ్మెల్యే



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

ఇచ్చోడ, జూన్ 15: మండలంలోని కేశవపట్నం గ్రామ పోడు రైతులు, అటవీశాఖ అధికారులు గతవారం రోజులుగా భూమికి సంబంధించి ఎదుర్కొంటున్న సమస్యలపై శనివారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ కలెక్టర్ రాజార్షిషాను కలిసి వారి సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని కోరారు. రైతుల శాశ్వత పరిష్కారానికై పోడు రైతులు ఇబ్బందులు పడకండా ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టాలు ఇచ్చి ఆదుకోవాలన్నారు. బోథ్ నియోజకవర్గ పోడు భూముల రైతులు ఇబ్బందులు పడకుండా వారికి అండగా ఉండాలని కోరారు. అనంతరం గ్రామస్థులతో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఎమ్మెల్యే ఫోన్‌లో పోడురైతుల సమస్య చిత్రాలను చూపుతూ.. సమస్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నిమ్మల ప్రీతంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు మహాలక్ష్మీ ఆలయ వార్షికోత్సవం

తాంసి, జూన్ 15: పొన్నారి గ్రామంలో శ్రీ మహాలక్ష్మీ ఆరో ఆలయ వార్షికోత్సవాన్ని భక్తులు తరలిరావాలని ఆలయ కమిటీ అధ్యక్షుడు కన్నాజీ నర్సింగ్‌చారి తెలిపారు. ఆదివారం ప్రత్యేక అభిషేకాలు, పూజా కార్యక్రమాలకు ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే అనిల్ జాదవ్ హాజరవుతారని తెలిపారు.



భైంసా ఎంఈవో కార్యాలయంలో వినతి పత్రం అందచేస్తున్న ఏబీవీపీ

ప్రైవేట్ పాఠశాలల ఆగడాలను అరికట్టాలి

భైంసా, జూన్ 15 : ప్రభుత్వ నిబంధనలను కాలరాస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న భైంసాలోని ప్రైవేట్ పాఠశాలల ఆగడాలను నియంత్రించేందుకు అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని ఏబీవీపీ మహిషా శాఖ డిమాండ్ చేసింది. శనివారం ఏబీవీపీ ఇందూర్ విభాగ్ ఎస్ఎఫ్‌డీ కన్వీనర్ గంగాప్రసాద్, డివిజన్ ప్రతినిధులు చంద్రకాంత్, ప్రకాష్, వివేక్‌ల ఆధ్వర్యంలో యూనియన్ శ్రేణులు భైంసా మండల విద్యాధికారి కార్యాలయం ఎదుట ఆందోళనలు చేపట్టారు. ప్రైవేట్ పాఠశాలల ఆగడాలను వ్యతిరేకిస్తూ నిరసన ప్రదర్శనలు చేపట్టారు.అనంతరం సంబంధిత విషయంలో ఎంఈవో కార్యాలయంలో వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఏబీవీపీ ఇందూర్ విభాగ్ ఎస్ఎఫ్‌డీ కన్వీనర్ గంగా ప్రసాద్ మాట్లాడుతూ భైంసా పట్టణ పరిధిలోని ప్రైవేట్ పాఠశాలల యజమాన్యాలు ఫీజులను ఇష్టారాజ్యంగా పెంచి విద్యార్థుల తల్లితండ్రులపై మోయలేని భారాన్ని మోపుతున్నాయని ఆరోపించారు. ఇదే క్రమంలో ప్రభుత్వ ఆదేశాలను బేఖాతరు చేస్తూ నిబంధనలకు విరుద్ధంగా తమ తమ విద్యా సంస్థల్లో పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్స్‌తో పాటు ఇతర స్టేషనరీ సామాగ్రిని విక్రయిస్తున్నారని పేర్కొన్నారు. బహిరంగంగా విక్రయాల పర్వం కొనసాగుతున్న అధికారులెవరూ పట్టించుకోక పోవడం శోచనీయమన్నారు. విద్యాశాఖాధికారులు ఇకనైనా స్పందించి ప్రైవేట్ పాఠశాల ఆగడాలను నియంత్రించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. లేని పక్షంలో యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని వెల్లడించారు.

నియామక అధికారిని నియమించడంలో ప్రభుత్వం విఫలం

ఉట్నూర్, జూన్ 15 :తెలంగాణ ప్రభుత్వం హయంలో రెండున్నర ఏళ్ల కింద 317 జీవో అమల్లోకి తెచ్చినప్పటికి గిరిజన విద్యారంగంలో పని చేస్తున్న అధికారులు నియామక అధికారిని నియమించడంలో విఫలమయ్యారని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి ముడుగు శామ్యూల్ ఆరోపించారు. శనివారం స్థానిక ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గిరిజన విద్యారంగం నియామక అధికారి లేకుండానే కొనసాగుతుందన్నారు. ఐటీడీఏ యజమాన్యంలో ఉన్న ప్రాథమిక పాఠశాలలు, ఆశ్రమ ఉన్నత పాఠశాలలు నిర్వహిస్తున్నారని అన్నారు. ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటీలు పీఎస్ హెచ్‌ఎంలు స్కూల్ అసిస్టెంట్‌ల నియామక అధికారిగా జీవో45 ప్రకారం గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కొనసాగుతున్నారని, ఆశ్రమ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుల నియామక అధికారిగా జిల్లా కలెక్టర్ కొనసాగారన్నారు.జీవో 317 ప్రకారం జిల్లా పోస్టుగా ఉన్న గజిటెడ్ హెచ్‌ఎం పోస్టులు మల్టిజోనల్ పోస్టులుగా మారాయని అన్నారు. ప్రభుత్వం మల్టీజోనల్ అధికారిని నియమించడంలో నిర్లక్ష్యం చేస్తున్నడంతో ఉపాధ్యాయులు బదిలీల, పదోన్నతుల ప్రక్రియ నిలిచి పోయిందన్నారు. 2015 నుంచి రెగ్యూలర్ బదిలీలు పదోన్నతులు లేని కారణంగా ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం నియామక అధికారుల్ని నియమించి బదిలీలు పదోన్నతులు చేపట్టకపోతే ఐటీడీఏ కార్యాలయాల ముందు ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు రాథోడ్‌రవిత, జిల్లా కౌన్సిలర్లు సి.వీరయ్య, ఎం.చంద్రబాన్‌లు పాల్గొన్నారు.

అంబేద్కర్ యువజన సంఘం కార్యవర్గం ఎన్నిక

కుభీర్, జూన్ 15 : కుభీర్ మండల కేంద్ర అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో శనివారం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా కస్తూరే రాహుల్, ఉపాధ్యక్షునిగా దుగ్గే నాగారావు, ప్రధాన కార్యదర్శిగా ఉమ్మే భీంరావు నియమితులయ్యారు.

ఉరుముతున్న మేఘమా.. కురవవేమి ?

● వర్షం కోసం అన్నదాతల ఎదురుచూపు ● మృగశిర కార్తె ప్రారంభమై వారం రోజులు కావస్తున్నా కరుణించని వరుణ దేవుడు

ముథోల్, జూన్ 15 : రైతులు గంపెడాశతో ఖరీఫ్ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సంవత్సరం సమృద్ధిగా వర్షాలు పడతాయని, చేసిన అప్పులు తీరుతాయని సంతోషంతో దుక్కి దున్ని పంట పొలం చదును చేసి విత్తనాలు సైతం కొనుగోలు చేసుకున్నారు. వర్షం పడిన వెంటనే విత్తనాలు విత్తేందుకు సిద్ధంగా ఉన్న రైతులకు నిరాశే మిగులుతుంది. మృగశిర కార్తె ప్రారంభమై ఎనిమిది రోజులు కావస్తున్న వరుణదేవుడు కరుణించకపోవడంతో రైతన్న ఆశలు ఆవిరవుతున్నాయి. మండలంలోని మూడు నాలుగు గ్రామాల్లోనే ఒకటి రెండు వర్షాలు పడ్డాయి. మిగతా గ్రామాల్లో వర్షం పడలేదు. ప్రతీరోజు రైతులు ఉరుముతున్న మేఘాలను చూడడం తప్ప వర్షం కురవకపోవడంతో నిరాశ చెందుతున్నారు. మరికొందరు రైతులు దుక్కి దున్ని పొడి దుక్కులలోనే విత్తనాలు సైతం విత్తారు. కానీ వర్షం కురవకపోవడంతో విత్తనాలు విత్తిన రైతుల గుండెల్లో కూడా గుబులు పడుతున్నాయి. ఈపాటికే మండలంలోని అయా గ్రామాల్లో రైతులు వర్షం పడితే సోయా, పత్తి విత్తనాలు విత్తేందుకు సంసిద్ధంగా ఉన్నారు. కానీ వరుణదేవుడు కరుణించకపోవడంతో రైతన్నలు ప్రతీరోజు వర్షం కోసం ఆకాశం వైపు వేచి చూస్తూ ఉన్నారు. వర్షం కురవాలని మండలంలోని అయా గ్రామాల్లో గ్రామ దేవతలకు గంగాజలంతో అభిషేకం చేయడం, బిందె పూజలు చేయడం తదితర కార్యక్రమాలు చేస్తున్నారు.



విత్తనాలు విత్తేందుకు సిద్ధంగా ఉన్న చేను


ఏదిఏమైనా వర్షం కురవకపోవడంతో రైతన్నలు దిగులు పడుతున్నారు. వరుణ దేవుడు కురుణించి సమృద్ధిగా వర్షాలు కురిసినట్లయితే రైతన్నలు తమ పంట పొలాలకు విత్తనాలతో పరుగులు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నారు.

మన బడి పనుల్లో కానరాని కదలిక

● రెండేళ్లు గడిచినా అసంపూర్తిగానే పనులు ● పట్టించుకోని సంబంధిత శాఖ ఏఈ, అధికారులు



కుభీర్‌లోని ప్రాథమిక పాఠశాలలో సంవత్సరంగా పూర్తి కాని మన బడి పనులు





కుభీర్ ప్రాథమిక పాఠశాలలో పూర్తి కాని మన బడి తరగతి గదులు

కుభీర్, జూన్ 15 : సర్కారు బడులను కార్పొరేట్ స్థాయి హంగులు సమకూర్చడమే లక్ష్యంగా ప్రభుత్వం మన ఊరు మన బడి కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ పనులతో సకల సౌకర్యాలు ఏర్పడతాయని అంతా భావించారు. అయితే రెండేళ్ల గడుస్తున్న పనులు అసంపూర్తిగానే మిగిలిపోయాయి. సంబంధిత ఏఈ, ఇన్‌చార్జీ ఎంఈవో మన ఊరు మన బడి పనులు ప్రారంభం నుంచే పట్టించుకోకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంతోనే పనులు పూర్తి కాలేదని పలువురు పోషకులు ఆరోపిస్తున్నారు. దీనికి తోడు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. మన ఊరు మన బడిలో మంజూరైన 24 పాఠశాలల నుంచి కేవలం డొడర్న, రాంసింగ్, తాండా నెం. 4లో గల ప్రాథమిక పాఠశాల, కస్రా నయాబాది ప్రాథమిక పాఠశాలలు రెండు మాత్రమే పూర్తయ్యాయి. 22 పాఠశాలలు పనులు పెండింగ్‌లో ఉన్నాయి. అమ్మ ఆదర్శ కమిటీల పేరుతో మండలంలోని 72 పాఠశాలలకు నిధులు మంజూరు కాగా పనులు నత్త నడకన సాగడంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. పనులు త్వరగా పూర్తి చేయాలని కలెక్టరుకు ఆదేశాలు జారీ చేస్తున్న అధికారుల పట్టింపు కరువైంది. విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యం కారణంగా మన బడి పనులు మాత్రం ఆగిపోయాయి. అమ్మ ఆదర్శ కమిటీల పేరుతో ప్రారంభించిన పనులు ముందుకు సాగడం లేదు. దీంతో విద్యాసంవత్సరం విద్యార్థులు సమస్యల మధ్య చదువులు కొనసాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

● మండలంలో ఇదీ పరిస్థితి

మండలంలో ఆరు జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలు, ఆశ్రమ పాఠశాలలు, ఉర్దూమీడియం స్కూల్, కేజీబీవీ పాఠశాలలు మొత్తం 8 ఉన్నత పాఠశాలలు, 13ప్రాథమికోన్నత, 51 ప్రాథమిక పాఠశాలలు, అమ్మ ఆదర్శ మొత్తం 72 స్కూల్స్ కమిటికి ఎంపికయ్యాయి. వీటిలో శౌచాలయాల నిర్మాణం, నీటి సదుపాయం, విద్యుత్, తాగునీరు, డెస్క్ బెంచీలు ప్రతీ పాఠశాలకు రంగులు వేయించడం, మరమ్మతులు, గ్రీన్‌చాక్‌బోర్డు ఏర్పాటు, ప్రహరీ, సౌరవిద్యుత్ సౌకర్యాలు, డైనింగ్‌హాల్ వంటి 12 ఎస్ఎంసీ చైర్మన్‌లు, గుత్తేదారులు పనులు చేపడుతున్నారు. ఈ పనుల పై సంబంధిత ఏఈవో మహేష్‌కి ఫోన్‌లో సంప్రదించగా స్పందించడం లేదు. ఇప్పటికయినా ఉన్నతాధికారులు స్పందించి సకాలంలో పనులు పూర్తి చేసి విద్యార్థులకు వసతులు కల్పించాలని పోషకులు కోరుతున్నారు.

నియోజకవర్గ సమగ్రాభివృద్ధే లక్ష్యం

● ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

తలమడుగు, జూన్ 15 : ఖానాపూర్ నియోజకవర్గం సమగ్రాభివృద్ధే ప్రధానలక్ష్యంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పలు కాలనీల్లో విస్తృతంగా మార్నింగ్‌వాక్ కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి కాలనీలో అన్ని మౌలికవసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలన్నింటినీ పరిష్కరిస్తూ ముందుకు సాగుతున్నామన్నారు. ప్రజలు తనపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టు కునేందుకు నిరంతరం కృషి చేస్తూనే ఉన్నామన్నారు. ఇచ్చిన ప్రతి హామీని దశల వారీగా నెరవేరుస్తున్నామన్నారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసమే మార్నింగ్ వాక్ కార్యక్రమాన్ని ప్రారంభించి కొనసాగిస్తున్నామని అన్నారు. ప్రజలకు చేరువగా వెళ్లి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారం చేసేందుకు మార్నింగ్ వాక్ ఉపయోగపడిందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముఖడే ఉత్తం, సోన్ కాంబ్లే జితేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల నిర్మాణాలు స్ఫూర్తిదాయకం

ఆదిలాబాద్ రూరల్, జూన్ 15 : బీఆర్ఎస్ ప్రభుత్వంలో నిర్మించిన ఆలయాల నిర్మాణాలు నేటికి అవి స్ఫూర్తిదాయకంగా ఉన్నాయని మాజీ మంత్రి జోగురామన్న అన్నారు. ఆదిలాబాద్ రూరల్ మండలంలోని యాపల్‌గూడలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాల్లో మాజీ మంత్రి జోగు రామన్న పాల్గొని ప్రసాద వితరణ చేశారు. గ్రామస్తులు జోగు రామన్నని శాలువాతో ఘనంగా సన్మానించారు. మొదట వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జోగు రామన్న మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వంలో అలయాల నిర్మాణానికి పెద్ద పీట వేసిందన్నారు. యాదాద్రి దేవాలయంతోపాటు కేస్లాపూర్ నాగోబా ఆలయం ఆలయాలతోపాటు కట్టడాలు చరిత్రలో నిలిచిపోయాయన్నారు. ప్రతీ ఒక్కరు ఆధ్యాత్మికం వైపు అడుగులు వేస్తూ మానసిక ప్రశాంతతోపాటు దైవచింత నాతో ముందుకు పోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గంద్రత్ రమేష్, ఇజ్జగిరి నారాయణ, కుమ్ర రాజు, పరమేశ్వర గ్రామస్తులు పాల్గొన్నారు.

దహిగూడ నీటి పంపును పరిశీలించిన మాజీ మంత్రి

ఆదిలాబాద్ రూరల్ మండలంలోని పిప్పలదరి, దహిగూడ గ్రామాల్లో శనివారం పర్యటించారు. గ్రామస్తులను తాగునీటి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. దహిగూడలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.కోట్లతో ఏర్పాటు చేసిన మిషన్ భగీరథ పంపు కేంద్రాన్ని జోగు రామన్న పరిశీలించారు. పంపులోకి నీరు చేరకపోవడంతో నీటి కోరత ఏర్పడుతుందని తెలిపారు.

కలెక్టర్‌ను సన్మానించిన అధికారులు

ఆదిలాబాద్ రూరల్, జూన్ 15 : లోక్‌సభ సాధారణ ఎన్నికలను ఆదిలాబాద్ జిల్లాలో నోటిఫికేషన్ వెలువడినప్పటి నుంచి కౌంటింగ్ వరకు విజయవంతంగా పూర్తి చేసినందుకు కలెక్టర్ రాజర్షి షాకు భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ సర్టిఫికెట్ అందజేశారు. శనివారం ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో ఆయనను జిల్లా రెవెన్యూ సిబ్బంది, డీపీఆర్‌వో తిరుమల శాలువాతో సన్మానించారు. అందరి సహాయ సహకారాలు, సమిష్టి కృషి వల్లే ఎన్నికలను దిగ్విజయంగా పూర్తి చేశామన్నారు. కార్యక్రమంలో తిరుమల, ఏఓ అరవింద్, ఎన్నికల సూపరింటెంట్ నలందా, తహసీల్దార్ రాజేశ్వర్ పాల్గొన్నారు.

పాముకాటుతో మహిళ మృతి

భీంపూర్, జూన్ 15 : పాముకాటుతో మహిళ మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. భీంపూర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కైర్‌గూడ గ్రామానికి చెందిన పెందూర్ లక్ష్మీ (30) అనే గిరిజన మహిళ శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లో పనిచేస్తున్న క్రమంలో పాము బోటన వేలికి కాటు వేసింది. గమనించిన స్థానికులు వెంటనే అంబులెన్స్‌లో ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలిస్తుండగా దారిలో చనిపోయినట్లు రిమ్స్ డాక్టర్లు ధృవీకరించారు. కాగా ఐదేళ్ల క్రితమే తండ్రి చనిపోగా ఇప్పుడు తల్లి కూడా మృతి చెందడంతో ఇద్దరు పిల్లలు అనాథలయ్యారు. మృతురాలి అన్న మడవి మారుతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహ్మద్ కలీం తెలిపారు.

ఉపాధ్యాయుడి నియామకం పట్ల గ్రామస్థుల హర్షం

సిరికొండ, జూన్ 15: సిరికొండ మండలం ఫకీర్‌నాయక్‌తండా గ్రామంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలకు ఉపాధ్యాయుడి నియామకం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. పాఠశాలలు పునఃప్రారంభమై రెండు రోజులు గడిచినా ఉపాధ్యాయుడు రాకపోవడంతో గ్రామస్తులు తమ పిల్లలను ఎక్కడికి పంపాలో తోచక అయోమయంలో పడ్డారు. దీంతో ఆంధ్రజ్యోతికి సమాచారం అందించారు. శుక్రవారం ఆంధ్రజ్యోతిలో "తెరచుకోని పాఠశాల...అయోమయంలో తల్లిదండ్రులు" అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి స్పందించిన ఐటీడీఏ అధికారులు అదే రోజు ఐటీడీఏ డీడీ దిలీప్‌కుమార్ ఆదేశాల మేరకు ప్రభుత్వ గిరిజన సంక్షేమ ప్రామిక పాఠశాల ఫకీర్‌నాయక్‌తండాకు ఓ ఉపాధ్యాయుడిని నియమించారు. అలాగే పాలవాగు గ్రామంలోని పిల్లలకు తాత్కాలికంగా ఓ ఉపాధ్యాయుడిని సైతం నియమించడం జరిగిందని ఆయన తెలిపారు. దీంతో అధికారులకు, ఆంధ్రజ్యోతికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు.

త్వరగా గోదాంకు రూ. కోటి 50 లక్షలతో రోడ్డు నిర్మాణం

● మార్కెటింగ్ శాఖ ఏడీ శ్రీనివాస్

తలమడుగు, జూన్ 15 : మండల కేంద్రంలో గత ఆరు సంవత్సరాల క్రితం నిర్మించిన వ్యవసాయ మార్కెట్ కమిటీ గోదాంకు భారీ వాహనాలు వచ్చేందుకు సరైన రహదారి లేకపోవడంతో గ్రామస్థులు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రామస్తులు తలమడుగు జడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి మార్కెట్ శాఖ ఉన్నతాధికారి దృష్టికి తీసుకెళ్లడంతో శనివారం ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఏడీ శ్రీనివాస్ గోదాంను తనిఖీ చేసి గోదాంకు కోటి యాభై లక్షలతో రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు ఉన్నతాధికారులకు నివేదిక పంపించడం జరిగిందని, నిధులు మంజూరు కాగానే రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించడం జరుగుతుందన్నారు. అంతేకాకుండా తలమడుగులో గల గోదాం రైతులకు ఉపయోగపడే విధంగా ఇక్కడనే రైతులు పండించిన పంటలను కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లు చేపడతామన్నారు.

మహారాష్ట్రకు అక్రమంగా విత్తనాలు తరలిస్తే కఠినచర్యలు

తలమడుగు, జూన్ 15 : తెలంగాణ ప్రాంతానికి చెందిన పత్తి విత్తనాలు ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా మహారాష్ట్రకు తరలిస్తే కఠినచర్యలు తప్పవని తహసీల్దార్ రాజమోహన్ హెచ్చరించారు. శనివారం మండలంలోని లక్ష్మంపూర్ అంతర్ రాష్ట్ర చెక్‌పోస్టును ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్లాదర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రానికి చెందిన పత్తి విత్తనాలు ఎలాంటి అనుమతులు లేకుండా మహారాష్ట్రకు అక్రమంగా తరలిస్తే బాధ్యులపై కఠిన చర్యలు తప్పవన్నారు. చెక్‌పోస్టు సిబ్బంది ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలన్నారు. అనంతరం సుంకిడిలో గల పత్తి విత్తనాల దుకాణాన్ని తనిఖీ చేశారు. రైతులకు ఎవరూ కూడా నకిలీ విత్తనాలు విక్రయించవద్దన్నారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసే ముందు తప్పనిసరిగా కంపెనీకి సంబంధించిన సమాచారంతో కూడిన వివరాలను విత్తనాలు ముద్రించిన ఎక్స్‌పైర్ డేట్‌ను తప్పనిసరిగా రసీదులో పొందుపరిచి రైతులకు అందించాలన్నారు. అంతేకాకుండా ఎంఆర్‌పీ ధర కంటే ఎక్కువ ధరకు విత్తనాలు విక్రయించవదన్నారు. రైతులు పంట పొలాల్లో రెండు, మూడు వర్షాలు పడ్డాకనే వ్యవసాయ అధికారుల సలహాలు సూచనలు పాటించి పత్తి విత్తనాలను నాటుకోవాలని కోరారు.

andhrajyothy.com
శనివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 39.3 : కనిష్ఠం 23.2

ఆంధ్రజ్యోతి



ఆదిలాబాద్
జిల్లా వార్తలు

5

ఆదివారం 16 జూన్ 2024

'గోవులను తరలించినా, వధించినా కఠిన చర్యలు'

ఇచ్చోడ, జూన్15: గోవులను తరలించినా, వధించినా చర్యలు ఉంటాయని పశుసంవర్థక శాఖ వైద్యాధికారి గోవింద్‌నాయక్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బక్రీద్ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని అన్నారు. బక్రీద్‌ను పురస్కరించుకుని హైకోర్టు ఆదేశానుసారం మండలంలో గోవధను నిషేధం జరిగిందని, కురేషిలు ఎవరైనా గోవులను వాహనాలల్లో తరలించినా, వధించినా వారిపై కఠినచర్యలు తప్పవన్నారు. ప్రతిఒక్కరూ సహకరించి పండగను శాంతియుతంగా జరుపుకోవాలని కోరారు.



పిల్లల ఎత్తు, బరువును పరిశీలిస్తున్న అధికారులు

అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేసిన రాష్ట్ర బృందం

- పిల్లల వయసుకు తగ్గ బరువు ఎత్తు ఉండాలని సూచన

తలమడుగు, జూన్15: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలను శనివారం మహిళా శిశు సంక్షేమ శాఖ, ఐసీడీఎస్ రాష్ట్ర పరిశీలన బృందం ఆకస్మికంగా తనిఖీ చేసింది. ఈ సందర్భంగా రాష్ట్ర పరిశీలన అధికారి సురేందర్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పౌష్టికాహారాన్ని అందిస్తుందన్నారు. అలాగే పిల్లలు వారి వయసుకు తగ్గ ఎత్తు, బరువు ఉండాలని సూచించారు. ప్రతీ వారం పిల్లల బరువులను, ఎత్తులను కొలవాలని సూచించారు. అంతేకాకుండా అంగన్‌వాడీ సిబ్బంది సమయ పాలన పాటించి, మెరుగైన సేవలు అందించాలని కోరారు. అంగన్‌వాడీ కార్యకర్తల ద్వారా చేపడుతున్న ఆన్‌లైన్ సర్వేను పకడ్బందీగా చేపట్టాలన్నారు. అంతేకాకుండా పిల్లల వివరాలను ప్రభుత్వం సరిపడా చేసిన పౌష్టికాహార వివరాలను ఎప్పటికప్పుడు రిజిష్టర్‌లో పొందుపరచాలని సూచించారు. అనంతరం అంగన్‌వాడీ సెంటర్లకు సంబంధించిన రిజిష్టర్ పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అన్ని సక్రమంగా ఉండటంతో వారిని అభినందించారు. కార్యక్రమంలో సీడీపీవో నరసమ్మ, సూపర్ వైజర్ విజయలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు రమణ, మంజుల, పద్మ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల హాజరుశాతం అంతంతే...!

- జిల్లాలో బడిబాటకు అంతంత మాత్రంగానే కనిపిస్తున్న ఆదరణ
- సర్కారు బడుల్లో నామమాత్రంగానే హాజరు శాతం నమోదు
- తల్లిదండ్రులతో కలిసి సాగు పనులకు వెళ్తున్న విద్యార్థులు
- ఏజెన్సీలో చదువులకు దూరమవుతున్న గిరిజన విద్యార్థులు

ఆదిలాబాద్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వ పాఠశాలలు పునఃప్రారంభమైనా ఆశించిన స్థాయిలో విద్యార్థుల హాజరు శాతం నమోదు కావడం లేదు. జిల్లాలో తొలకరి వర్షాలు కురవడంతో పంటల సాగు పనులు ఊపందుకున్నాయి. దీంతో బడి వదిలి పలువురు విద్యార్థులు పొలంబాట పడుతున్నారు. చిన్నా, పెద్ద అనే తేడా లేకుండా కుటుంబమంతా పంట చేన్లకే పరిమితమవుతున్నారు. పాఠశాలలు ప్రారంభమై మూడు రోజులు గడుస్తున్నా అంతంత మాత్రంగానే హాజరు శాతం కనిపిస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ప్రభుత్వం జూన్ 6 నుంచి 19 వరకు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. 9 రోజులు గడుస్తున్నా ఆశించిన స్థాయిలో అడ్మిషన్లు కనిపించడం లేదు. ఇప్పటి వరకు 3,483 విద్యార్థులు మాత్రమే 1వ తరగతిలో చేరినట్లు విద్యాశాఖ అధికారుల లెక్కల ప్రకారం తెలుస్తోంది. అసలే ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో ఓ రకమైన అభిప్రాయం వ్యక్తమవుతోంది. దీనికి తోడు ఉపాధ్యాయుల నిర్లక్ష్యం కారణంగా సర్కారు బడుల్లో చేరేందుకు విద్యార్థులు ఆసక్తి చూపడం లేదు. జిల్లాలో డీఈవో పరిధిలో 702 పాఠశాలలు, ఐటీడీఏ పరిధిలో 444 పాఠశాలలు ఉన్నాయి. మైదాన ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి కొంత మెరుగ్గానే కనిపిస్తున్నా ఏజెన్సీ మారుమూల గిరిజన గ్రామాల్లో పరిస్థితులు అధ్వానంగా మారి కనిపిస్తున్నాయి. కొన్ని పాఠశాల్లో ఉపాధ్యాయులు సక్రమంగా విధులు నిర్వహించక పోవడంతో విద్యార్థుల హాజరు శాతం కనిపించడం లేదంటున్నారు. మరికొన్ని గ్రామాల్లో ఉపాధ్యాయులు ఉన్న తల్లిదండ్రుల్లో సరైన అవగాహన లేక విద్యార్థులను బడికి పంపించేందుకు ఆసక్తి చూపడం లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

సాగు సందడితో బడికి డుమ్మా

జిల్లాలో ప్రస్తుతం పంటల సాగు సందడి కనిపిస్తోంది. దీంతో చాలా మంది విద్యార్థులు బడికి డుమ్మా కొడుతూ పంటల సాగు పనుల్లో నిమగ్నమవుతున్నారు. తొలకరి వర్షం కురవడంతో గ్రామాల్లో రైతులందరు ఒకేసారి పంటల సాగుకు శ్రీకారం చుట్టారు. దీంతో గ్రామాల్లో రైతుకూలీల కొరత తీవ్రంగా ఏర్పడుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో తల్లిదండ్రులకు సాగు పనుల్లో సహాయం చేసేందుకు విద్యార్థులు కూడా తరలివెళ్తున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు పొలం పనుల్లోనే నిమగ్నమవుతున్నారు. కొన్ని గ్రామాల్లో కూలీలు అందుబాటులో ఉన్నా పెట్టుబడులకు చేతిలో చిల్లిగవ్వ లేక పోవడంతో కుటుంబ సమేతంగా పంట చేన్లకు వెళ్తున్నారు. కూలీల ధరలు కూడా పెరగడంతో సొంతంగానే సాగు పనులు చేసుకునేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. కొందరు ఉపాధ్యాయులు పాఠశాలకే పరిమితం కావడం తో తల్లిదండ్రుల్లో అవగాహన కరువై విద్యార్థుల హాజరు శాతం అంతంత మాత్రంగానే కనిపిస్తోంది. ఏదోఉదయం స్కూల్‌కు వెళ్లామా సాయంత్రం తిరిగి వచ్చామా అన్నట్లుగా కొందరు ఉపాధ్యాయుల తీరు కనిపిస్తోంది. బాధ్యతాయుతంగా విధులు నిర్వహించక పోవడంతో అమాయక గిరిజన విద్యార్థులు చదువులకు దూరమవుతున్నారు.

పెరిగిపోతున్న డ్రాపౌట్స్

జిల్లాలో ఏటేటా డ్రాపౌట్ల సంఖ్య భారీగా పెరగడం ఆందోళన రేపుతోంది. 2023-24 విద్యా సంవత్సరానికి గాను జనవరి, ఫిబ్రవరి మాసంలో చేపట్టిన ప్రత్యేక సర్వేలో జిల్లాలో 6-14 ఏళ్ల లోపు విద్యార్థులు 563 మంది డ్రాపౌట్లు ఉండగా 15-19 ఏళ్ల లోపు విద్యార్థులు 121 మంది ఉన్నట్లు విద్యాశాఖ అధికారుల లెక్కల ప్రకారం తెలుస్తోంది. ఈ సంఖ్య మరింత అధికంగానే ఉంటుందని చెబుతున్నారు. రాష్ట్రంలోనే జిల్లా 6వ స్థానంలో ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. డ్రాపౌట్లను తిరిగి బడిలో చేర్పించేందుకు అధికారులు చర్యలు చేపట్టక పోవడంతో గిరిజన విద్యార్థులు చదువులకు దూరమవుతున్నారు. ప్రత్యేకంగా బడిబాట కార్యక్రమాన్ని చేపట్టినా అంతంత మాత్రంగానే ఆదరణ కనిపిస్తోంది. 14 ఏళ్ల లోపు పిల్లలను బడిలో చేర్పించి 19 ఏళ్ల లోపు పిల్లల చదువులకు అవసరమైన ఏర్పాట్లను చేపట్టాల్సి ఉంటుంది. గతంలో విద్యార్థులు ఓపెన్ స్కూల్లో చేరేందుకు ప్రభుత్వమే ఫీజు చెల్లించినా ఈ ఏడు మాత్రం అలాంటి ఆదేశాలు లేవని అధికారులు పేర్కొంటున్నారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారమే చర్యలు తీసుకుంటామని విద్యాశాఖాధికారులు చెబుతున్నారు. 14 ఏళ్ల లోపు పిల్లలను ఖచ్చితంగా బడిలో చేర్పించాల్సి ఉండగా ఇప్పటి వరకు అధి కారులు ప్రత్యేక కార్యాచరణ చేపట్టినట్లు కనిపించడం లేదు.

ఏజెన్సీలో ఆగమాగం

గిరిజన విద్యార్థులకు విద్యా అవకాశాలను అందించేందుకు ప్రభుత్వం ఎన్ని చర్యలు చేపట్టినా క్షేత్ర స్థాయిలో దానికి భిన్నమైన పరిస్థితులే కనిపిస్తున్నాయి. కొన్ని మారుమూల గిరిజన గ్రామాల్లో ఉపాధ్యాయులు లేక పోవడం, ఉన్నా సరిగా విధులకు హాజరు కాక పోవడంతో గిరిజన విద్యార్థులు చదువులకు దూరమవుతునే ఉన్నారు. తల్లిదండ్రుల్లో అవగాహన లేక పోవడం, కుటుంబ ఆర్థిక పరిస్థితులు అంతంత మాత్రంగానే ఉండడం, కఠినమైన పేదరికం, అనారోగ్య సమస్యలు గిరిజన విద్యార్థులను వెంటాడుతునే ఉన్నా యి. గిరిజనుల సర్వతోముఖాభివృద్ధికి ఐటీడీఏ ఉన్నా ఆశించిన స్థాయిలో ఫలితం కనిపించడం లేదు. ఇప్పటికీ కొన్ని గ్రామాల్లో మూసిన బడి తలుపులు తెరిచిన దాఖలాలు లేవంటున్నారు. ఒకవేళ పాఠశాలకు వెళ్లి న మధ్యాహ్నం వరకే ఉపాధ్యాయులు తిరుగు ముఖం పడుతున్నారు. ముఖ్యంగా మారుమూల గిరిజన గ్రామాలపై ఉన్నతాధికారులు దృష్టి సారించక పోవడంతో చదువులు సక్రమంగా ముందుకు సాగడం లేదని గిరిజనులు వాపోతున్నారు. కొంత మంది ఉపాధ్యాయులు సొంత పనులకే పరిమితమై తాత్కాలిక ఉపాధ్యాయులను నియమిస్తూ బడికి డుమ్మా కొడుతున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో బయోమెట్రిక్ విధానాన్ని అమలు చేస్తున్నా నెట్‌వర్క్ సమస్యలతో చాలా పాఠశాలల్లో ఈ విధానం అమలు కావడం లేదంటున్నారు. ఇకనైనా అధికారులు ఏజెన్సీ మారుమూల గిరిజన గ్రామాల్లోని పాఠశాలలపై ప్రత్యేక దృష్టి సారించా లని పలువురు కోరుతున్నారు.

ప్రియుడితో కలిసి భర్తను హత్య చేయించిన భార్య

- మిస్టరీ వీడిన ప్రభుత్వ ఉపాధ్యాయుడి హత్య
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ నాగేందర్



కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ నాగేందర్, వెనుక ముసుగులో నిందితులు

ఉట్నూర్, జూన్15: గాదిగూడ మండలం అర్జుని సమీపంలో జరిగిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు గజేందర్ హత్యమిస్టరీ వీడింది. ప్రియుడితో కలిసి ఉపాధ్యాయుడి భార్యే కొందరికి సుపారీఇచ్చి హత్య చేయించింది. శనివారం ఉట్నూర్ పోలీసు స్టేషన్‌లో ఈ కేసుకు సంబంధించిన వివరాలను డీఎస్పీ నాగేందర్ విలేకరులకు వివరించారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లాలోని నార్నూర్ మండలం నాగోల్‌కొండకు చెందిన బిక్కు కుమారుడైన గజేందర్ జైనథ్ మండలంలోని మేడిగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. గజేందర్‌కు తొమ్మిదేళ్ల క్రితం నాగోల్‌కొండకే చెందిన విజయలక్ష్మితో వివాహమైంది. వీరికి ఏడేళ్ల కుమారుడు ఉన్నారు. గజేందర్ కుటుంబంతో కలిసి జిల్లా కేంద్రంలోని రామ్‌నగర్‌లో నివాసం ఉంటున్నాడు. వేసవి సెలవుల్లో భాగంగా 40 రోజుల పాటు భార్య కొడుకుతో కలిసి స్వగ్రామంవ అయిన నాగోల్‌కొండలో ఉన్నారు. అయితే గజేందర్ భార్య విజయలక్ష్మికి ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలం తాడిహత్నూర్‌కు చెందిన రాథోడ్ మహేశ్‌తో వివాహేతర సంబంధం కొనసాగుతోంది. నిజామాబాద్‌లో డిగ్రీ చదివే రోజుల నుంచే వీరిద్దరి మధ్య సాన్నిహిత్యం ఉంది. పెళ్లి తర్వాత విషయం తెలుసుకున్న గజేందర్, అతని భార్యకు పలుమార్లు గొడవ కూడా జరిగింది. తర్వాత ఇరు కుటుంబాల పెద్దల జోక్యంతో కొంతకాలం పాటు గొడవలు సద్దుమణిగాయి. కానీ విజయలక్ష్మీ మాత్రం ప్రియుడు రాథోడ్ మహేశ్‌తో వివాహేతర సంబంధం కొనసాగిస్తూ వచ్చింది. అయితే తమ ఆనందానికి భర్త గజేందర్ అడ్డుగా ఉన్నాడని భార్య భావించి.. అతన్ని ఎలాగైనా చంపాలని ప్రియుడు రాథోడ్ మహేశ్‌తో కలిసి ప్రణాళిక రూపొందించింది. ఇందుకోసం బేల పెట్రోల్ బంక్‌లో పని చేస్తున్న బోదే సుశీల్, ఉర్వేత కృష్ణ అనే ఇద్దరు యువకులకు ఒక్కొక్కరికి రూ.3లక్షల చొప్పున సుపారి ఇచ్చి.. గజేందర్‌ను చంపేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. ముందస్తు ప్రణాళికలో భాగంగా పాఠశాలలు పునఃప్రారంభమైన రోజు గజేందర్ తన బైక్‌పై మేడిగూడ ప్రభుత్వ పాఠశాలకు వెళ్తుండగా.. మార్గమధ్యలో గాదిగూడ మండలం అర్జుని సమీపంలో రాథోడ్‌మహేశ్, బోదే సుశీల్, ఉర్వేత కృష్ణ కలిసి అడ్డుకున్నారు. రెండు బైకులతో గజేందర్‌ను వెంబడించి.. పట్టుకున్నారు. ఆ తర్వాత ముగ్గురు కలిసి గజేందర్‌ను పంటపొలాల్లోకి లాక్కెళ్లి బండరాయితో కొట్టి దారుణంగా హత్యచేశారని ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్ వివరించారు. హత్య జరిగిన రోజున మృతుడి తండ్రి బిక్కు తన కోడలు విజయలక్ష్మిపై అనుమానం ఉందని తెలపడంతో.. ఆ దిశగా దర్యాప్తును వేగవంతం చేసి పట్టుకున్నామని తెలిపారు. ఈ కేసులో మృతుడి భార్య విజయలక్ష్మితోపాటు ప్రియుడు రాథోడ్ మహేశ్, బేలకు చెందిన బోదే సుశీల్, కృష్ణలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ వివరించారు. విలేకరుల సమావేశంలో సీఐలు రహీంపాషా, గండికోట మొగిలి, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోని సమస్యలను పరిష్కరించాలి: ఏఐఎస్ఎఫ్

బోథ్, జూన్ 15: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని, కనీస సదుపాయాలు కల్పించాలని ఏఐఎస్ఎఫ్ మండల అధ్యక్షులు మున్సిఫ్ కోరారు. ఈ మేరకు శనివారం ఎంఈవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినతిపత్రంలో పాఠ్య పుస్తకాలను, యూనిఫాంలను అందించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలో గత సంవత్సరం వివిధ సబ్జెక్టులు బోధించే ఉపాధ్యాయులు లేక విద్యార్థులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ఉపాధ్యాయులు కొరత లేకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

అనుమానంతో భార్యను హతమార్చిన భర్త

- 24 గంటల్లోనే హత్య కేసును ఛేదించిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ జీవన్‌రెడ్డి

ఆదిలాబాద్‌రూరల్, జూన్15: జిల్లాకేంద్రంలోని ఖుర్షిద్‌నగర్‌లో రోడ్డుపక్కన గుర్తుపట్టకుండా మృతిచెంది పడి ఉన్న మహిళ కేసును పోలీసులు 24 గంటల్లోనే ఛేదించారు. భార్యపై అనుమానంతో భర్త ఖలీల్‌ఖాన్ దారుణంగా హతమార్చి రోడ్డుప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం చేశాడు. శనివారం ఆదిలాబాద్ టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఈ మిస్టరీ హత్య కేసు వివరాలను డీఎస్పీ జీవన్‌రెడ్డి వెల్లడించారు. ఆదిలాబాద్ పట్టణంలోని ఖుర్షీద్‌నగర్ కాలనీలో నివాసముండే ఆటో డ్రైవర్ ఖలీల్‌ఖాన్ ఈనెల 12న అర్ధరాత్రి ఇంటికిరాగా ఇంట్లో నుంచి గుర్తుతెలియని వ్యక్తులు పరిగెడుతూ కనిపించారు. దీన్ని గమనించిన ఖలీల్‌ఖాన్ తన రెండో భార్య భారతి (35) అలియాస్ సల్మాతో వివాహేతర సంబంధం కొనసాగుతుందని అనుమానించి పిడిగుద్దులు గుద్ది కర్రచెక్కతో తలపై, ముఖంపై బలంగా కొట్టి హత్యచేశాడు. వెంటనే తన సొంత ఆటోలో మృతదేహాన్ని మమతా జిన్నింగ్ ఫ్యాక్టరీ పక్కన అడ్డంగా ఉన్న లారీ వెనుక భాగంలో పడేసి వెళ్లిపోయాడు. గుర్తుతెలియని మహిళ మృతి కేసు నమోదు చేసుకున్న టూటౌన్ పోలీసులు 24గంటల్లోనే ఛేదించి నిందితున్ని అరెస్ట్ చేశారు. మృతురాలు భారతి ఆదివాసీ తెగకు చెందిన మహారాష్ట్ర మహిళని, రెండోభార్యగా ఆమెపేరును సల్మాగా మార్చుకున్నాడని డీఎస్పీ జీవన్ రెడ్డి తెలిపారు. కేసును ఛేదించిన సీఐ అశోక్, ఎస్సై నాయక్, ఐడీపార్టీ సిబ్బంది రమేష్, నరేష్, క్రాంతిను డీఎస్పీ అభినందించారు.



కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ